## క్లుప్తంగా

### పాఠశాల సందర్శన

బోథ్: మండలంలోని ధన్నూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను అరబిందో సంస్థ వారి జీరో ఇన్‌వెస్ట్‌మెంట్ ఇన్నోవేషన్ ఎడ్యుకేషన్ ఇనిషియేటివ్స్ సభ్యులు బుధవారం సందర్శించారు. ఇటీవల పాఠశాలను జీవవతఈవికి ఎంపిక చేశారు. పాఠశాలలో సౌకర్యాలు, విద్యాభ్యాసం, డిజిటల్ తరగతుల బోధన గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పసుపులేటి గణపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్ వైద్య, అమరేందర్, ఖైరి సతీష్, ధనుంజయ్, ప్రశాంత్ కుమార్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

**కస్తూర్బా పరిశీలన**

బేల: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక పాఠశాలను బుధవారం సాయంత్రం జిల్లా న్యాయ సేవా సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, వంటగది, మరుగుదొడ్లు పరిశీలించారు. విద్యార్థుల సౌకర్యాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో జువైనల్ బోర్డు సభ్యురాలు రాణి, పాఠశాల ప్రత్యేకాధికారి నవీన పాల్గొన్నారు.

### దేశాభివృద్ధి కోసమే బీఆర్‌ఎస్

గుడిహత్నూర్: దేశ అభివృద్ధి కోసమే బీఆర్‌ఎస్ ఏర్పడిందని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. మండల పర్యటనలో భాగంగా అంబేద్కర్ సతీమణి రమాబాయి జయంతి పోస్టర్ విడుదల చేశారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కరాడ్ బ్రహ్మానంద్, షగీర్, శేక్ జమీల్, డీకే ఆనంద్, సంజయ్, కేంద్రే మాధవ్, సిందే రాము, రావణ్ ముండే, సలీంఖాన్ పాల్గొన్నారు.

### విజయవంతం చేయండి

గుడిహత్నూర్: రాహుల్ గాంధీకి సంఘీభావంగా పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి చేపడుతున్న హాత్ సే హాత్ జోడో యాత్రను విజయవంతం చేయాలని మండలాధ్యక్షుడు మల్యాల కరుణాకర్, నియోజకవర్గ ఇన్‌చార్జి జాదవ్ వసంత్‌రావ్ కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ ఆసిఫ్, మజీద్, షహీద్, శ్యాంరావ్, ఆరిఫ్‌ఖాన్ పాల్గొన్నారు.

### 'రానున్న ఎన్నికల్లో బీజేపీదే అధికారం'

ఇచ్చోడ: రానున్న ఎన్నికల్లో బీజేపీదే అధికారమని బీజేపీ గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకాటి దశరథ్ అన్నారు. బుధవారం మండలంలోని వడ్డెరగూడలో పలువురు బీజేపీలో చేరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి హామీలను అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆడే మానాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, మాధవ్ అమ్టె, జిల్లా కార్యదర్శి కోల్లూరి చంద్రశేఖర్, కేంద్రే నారాయణ పాల్గొన్నారు.

### స్కౌట్‌గైడ్‌కు 30 మంది విద్యార్థుల ఎంపిక

బోథ్: మండలంలోని పట్నాపూర్ ప్రభుత్వ ఆశ్రమ బాలుర పాఠశాలకు చెందిన 30 మంది విద్యార్థులు స్కౌట్‌గైడ్‌కు ఎంపికైనట్లు జిల్లా స్కౌట్‌గైడ్ అధికారి యాదవ్ రావ్ తెలిపారు. ఈసందర్భంగా పాఠశాలలో ఎంపికైన విద్యార్థులకు యూనిఫాం అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గొడం చందన్, ఉపాధ్యాయులు మెస్రం రాములు, వార్డెన్ లాలురామ్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### బియ్యం పంపిణీ చేయాలి

బేల: రాష్ట్ర ప్రభుత్వం రేషన్‌షాపుల్లో ఉచిత బియ్యం పంపిణీని చేపట్టాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు పోత్రాజ్ నవీన్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని బీజేపీ పార్టీ కార్యాలయంలో మాట్లాడారు. ఈనెలలో 11 రోజులు పూర్తయిన బియ్యం పంపిణీ చేపట్టకపోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు కోడె ప్రదీప్, ధర్నే జీవన్, సాదిక్, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

### హైమన్ డార్ఫ్ దంపతుల వర్ధంతి

ఆదిలాబాద్‌రూరల్: ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ బెట్టి ఎలిజబెత్ దంపతుల 36వ వర్ధంతిని బుధవారం జిల్లా కేంద్రంలోని పిట్టల్‌వాడలో గల ఆదివాసీ భవనంలో ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గోడం గణేష్, ఉయికే సంజీవ్, వెట్టి మనోజ్, సలాం వరుణ్, రాహుల్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌అర్బన్: ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ వర్ధంతిని జిల్లా కేంద్రంలోని టీఏజీఎస్ కార్యాలయంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. హైమన్ డార్ఫ్ దంపతుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీఏజీఎస్ జిల్లా అధ్యక్షుడు కుమ్రం ఈశ్వర్, ఆడ అర్జున్, కుర్సెంగా మారుతి, పూసం గణేష్, కుమ్రం దీపక్ పాల్గొన్నారు.

### గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఉట్నూర్‌రూరల్: మండలంలోని పులిమడుగు గ్రామంలో గుర్తు తెలియని మృతదేహం బుధవారం లభ్యమైంది. ఎస్సై భరత్‌సుమన్ తెలిపిన వివరాల ప్రకారం.. 60 వయస్సు కలిగిన వ్యక్తి కాషాయ లుంగి కలిగి ఉన్నాడని, మృతదేహం గుర్తు పట్టకుండా ఉందన్నారు. ఎవరికైన తెలిసిన వారు అయితే ఉట్నూర్ పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.

# కల్లాల నిర్మాణానికి వెనుకంజ

- ఆసక్తి చూపని రైతులు
- 161లో 77 మాత్రమే నిర్మాణం
- బిల్లులు రాకపోవడమే కారణం



కల్లాన్ని పరిశీలిస్తున్న అధికారులు, రైతులు

ఆదిలాబాద్‌రూరల్: ఉపాధిహామీ నిధులతో తన సొంత వ్యవసాయ పొలం వద్ద కల్లాలు నిర్మించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించింది. దీంతో ఆదిలాబాద్ రూరల్ మండలంలో చాలా మంది రైతులు కల్లాల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. నిర్మాణంలో మాత్రం ఆశించిన పురోగతి కనిపించలేదు. ముఖ్యంగా ఉపాధి సిబ్బంది సహకారం కొరవడటం, రైతులకు అవగాహన లేకపోవడం వల్ల నిర్మించుకునేందుకు ఆసక్తి చూపలేదు. అలాగే కల్లాలు నిర్మించుకున్న రైతులకు ఇప్పటికీ బిల్లులు అందని పరిస్థితి. మరికొందరికి సగం సొమ్ము మాత్రమే వచ్చింది. ఈ దశలో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ నుంచి కల్లాల నిర్మాణం కోసం కేటాయించిన నిధుల్ని వెనక్కి పంపాలని రాష్ట్ర ప్రభుత్వానికి తాఖీదు ఇవ్వడంతో అసలు కల్లాల నిర్మాణం లక్ష్యం పూర్తవుతుందా? నిర్మించుకున్న వారికి బిల్లులు వస్తాయా? అన్న ఆందోళన రైతుల్లో మొదలైంది.

**నిధులు కేటాయింపు ఇలా..**

మండలంలో 161 కల్లాల నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉపాధి నిధుల నుంచి రూ. 1,03,08,000 వ్యయం చేసేలా ప్రతిపాదించింది. రైతులు పంటలను పొలం వద్దే ఆరబెట్టుకొని కొనుగోలు కేంద్రాలకు తరలించాలని ప్రభుత్వం ఆశించింది. మండలంలో రైతులు వీటి నిర్మాణంపై మొదట్లో ఆసక్తి చూపినా.. బిల్లులు చెల్లింపుపై అనుమానాలతో చాలా మంది వెనక్కి తగ్గారు. మండలంలో 56 స్క్వేర్ ఫీట్‌లవి రూ. 55వేలతో 67 నిర్మించాలని లక్ష్యం పెట్టుకోగా ఇందులో 33 మంది రైతులు మాత్రమే నిర్మించుకున్నారు. మిగితా 34 నిర్మాణానికి నోచుకోలేదు. 60 స్క్వేర్ ఫీట్‌లవి రూ. 66 వేలతో 48 కల్లాలు నిర్మించాలని లక్ష్యం పెట్టుకోగా.. 18 మాత్రమే నిర్మించారు. మిగితా 30 నిర్మాణానికి నోచుకోలేదు. 756 స్క్వేర్ ఫీట్‌లకు సంబంధించి రూ. 75 వేలతో 46 నిర్మించుకునేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసుకోగా ఇందులో 26 మాత్రమే నిర్మించుకున్నారు. మిగితా 20 మంది నిర్మించుకోలేదు.

**బిల్లులు పెండింగ్‌లో లేవు**

కల్లాల నిర్మాణాలకు సంబంధించి ప్రస్తుతం తమ పర్యవేక్షణలో లేదు. తమ పర్యవేక్షణలో ఉన్న సమయంలో కల్లాలు నిర్మించుకున్న వారందరికీ బిల్లులు అందాయి. ప్రస్తుతం కల్లాల నిర్మాణాలు కొనసాగడం లేదు.

– గంగాధర్, ఈజీఎస్, ఏపీవో, ఆదిలాబాద్

# 'ధర్నా విజయవంతం చేయండి'



తాంసి: మాట్లాడుతున్న దేవన్న



జైనథ్: మాట్లాడుతున్న సురేందర్ రెడ్డి

తాంసి: పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని గురువారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాలో మండల రైతులు పాల్గొనాలని తెలంగాణ రైతు హక్కుల సంఘం భీంపూర్ అధ్యక్షుడు కాను దేవన్న కోరారు. బుధవారం మండలంలోని ధనోరాలో రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. ప్రతీ గ్రామం నుంచి రైతులు హాజరు కావాలని కోరారు. పండించిన పంటను రైతులు అమ్ముకోలేక ఇంట్లో నిల్వ చేసుకునే పరిస్థితి ఉందన్నారు. రూ. 10వేల ధరకు చెల్లించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో రైతులు రాజేష్, పోచ్చన్న, రతన్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎదులాపురం: అఖిలపక్ష రైతు సంఘాల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్ రెడ్డి ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. పత్తికి క్వింటాలుకు రూ.10 వేల గిట్టుబాటు ధర కల్పించాలన్నారు.

జైనథ్: కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ రైతు హక్కుల సాధన సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సురేందర్ రెడ్డి కోరారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతన్నలు నష్టపోతున్నారని తెలిపారు. ఉదయం 11 గంటలకు చేపట్టే ధర్నాకు అన్నదాతలు పెద్ద సంఖ్యలో హాజరై కావాలన్నారు. సమావేశంలో జైనథ్ మండల ఉపాధ్యక్షుడు సుభాష్, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలని గురువారం అఖిలపక్షం, రైతు సంఘాల ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్‌ఎస్ మండల కన్వీనర్లు, నాయకులు పాల్గొనాలన్నారు.

# పార్టీ బలోపేతానికి కృషి చేయాలి




కార్యకర్తలతో మాట్లాడుతున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: బీజేపీ బలోపేతానికి బూత్‌స్థాయి కార్యకర్తలు కృషి చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ అన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో బుధవారం పోలింగ్ బూత్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పోలింగ్ బూత్ కార్యకర్తలు అనుసరించాల్సిన వ్యూహాల గురించి వివరించారు. కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీజేపీ నాయకులు ముకుంద్, మయూర్ చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల స్వీకరణ

ఇచ్చోడ: తెలంగాణ గురుకులం అండర్ గ్రాడ్యుయేట్ ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రభుజ్యోతి తెలిపారు. బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. సాంఘిక సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాల్లో ప్రవేశాల కోసం ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు, ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అర్హత పరీక్ష మార్చి 5న నిర్వహిస్తామన్నారు.

# రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు



ముస్తాబైన వేంకటేశ్వర స్వామి ఆలయం

తాంసి: భీంపూర్ మండలంలోని నిపాని గ్రామంలో గల శ్రీ భూగోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ 16 వార్షికోత్సవం సందర్భంగా ఈనెల 13 నుంచి 17 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. మొదటి రోజున ఆలయ ప్రాంగణములో దేవతావాహనము, బలిహరణం, హారతి పూజ కార్యక్రమాలు నిర్వహించి, బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. చివరి రోజు వేదపండితుల మంత్రోచ్ఛారణ మధ్య లక్ష్మీ పద్మావతి వేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు సర్పంచ్ రాజన్న, ఆలయకమిటీ అధ్యక్షుడు గంగాధర్ రెడ్డి తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

### కుల దేవతలకు ప్రత్యేక పూజలు

ఇంద్రవెల్లి: పుష్యమాసం పురస్కరించుకొని నిర్వహించే కుల దేవత ఉత్సవాలు కొనసాగుతున్నాయి. కుల దేవతలకు ప్రత్యేక పూజలు చేసి పుణ్యస్నానాలు ఆచరించడానికి బుధవారం మండలంలోని పాకిడిగూడ ఆదివాసీలు గుడిహత్నూర్ మండలంలోని పులికచెరకు బయలుదేరారు.



పుణ్య స్నానానికి బయలుదేరిన ఆదివాసీలు

# నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలి



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ రవి

బజార్‌హత్నూర్: రబీ సాగులో పంటలు ఎండిపోకుండా వ్యవసాయానికి 24 గంటల త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేయాలని జెడ్పీటీసీ మల్లేపూల నర్సయ్య మండల విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ అజాడే జయశ్రీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వైస్ ఎంపీపీ పోరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతులు వ్యవసాయానికి విద్యుత్ కనెక్షన్ల కోసం డీడీలు తీసి ఆరు నెలలు అవుతున్న విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. విద్యుత్‌శాఖ సబ్ ఇంజనీర్ రవి మాట్లాడుతూ.. దరఖాస్తులు ఆన్‌లైన్ చేశామని ఉన్నతాధికారులకు పంపించామన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ నీటిని సరఫరా చేస్తున్నామని ఏఈ వెంకటేశ్ తెలిపారు. మనఊరు.. మనబడి కార్యక్రమంలో భాగంగా 12 ప్రభుత్వ పాఠశాలలో నిర్మాణపు పనులు చేపడుతున్నామని ఎంఈవో శ్రీకాంత్ పేర్కొన్నారు. ఈనెల 18 నుంచి కంటి వెలుగు కార్యక్రమం పకడ్బందీగా చేపడుతామని మెడికల్ ఆఫీసర్ భీంరావ్ అన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో చౌహాన్ రాధ, తహసీల్దార్ గంగాధర్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ, ఎఫ్‌బీవో ప్రీతం, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## అటెన్షన్ ప్లీజ్.. పని చేయని చేతిపంపు



సిరికొండ: మండలంలోని రిమ్మ గ్రామ పంచాయతీ పరిధిలోని తిమ్మాపూర్ పాఠశాలలోని చేతిపంపు పనిచేయక నిరుపయోగంగా మారింది. దీంతో విద్యార్థులు తాగునీటికి తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి చేతిపంపునకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు, మధ్యాహ్న భోజన నిర్వాహకులు కోరుతున్నారు.

సంబంధిత అధికారి: అరుణ్, పంచాయతీ కార్యదర్శి, ఫోన్: 80995 91672

# రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అధికారులు

నేరడిగొండ: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఎన్‌హెచ్ఏఐ టీం లీడర్ ప్రసన్న కుమార్ అన్నారు. బుధవారం మండలంలోని రోల్‌మామడ టోల్‌ప్లాజా వద్ద రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వాహనదారుడు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రాత్రి వాహనాలు కనిపించక ప్రమాదాలు బోటు చేసుకుంటున్నాయన్నారు. కార్యక్రమంలో రీజినల్ ఇంజినీరింగ్ సురేంద్ర బాబు, పటేల్ కేఎస్‌ఆర్ సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ ఎం.సూర్యనారాయణ, ప్రాజెక్ట్ ఇన్‌చార్జి రాంమోహన్ రెడ్డి, టోల్‌ప్లాజా ఇన్‌చార్జి పూనవత్రి వినేష్, పెట్రోలింగ్, అంబులెన్స్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి పన్ను వందశాతం వసూలు చేయాలి



మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస్

ఇంద్రవెల్లి: ఇంటి పన్ను వందశాతం వసూలు చేయాలని డీపీవో శ్రీనివాస్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్‌తో సమావేశమయ్యారు. గ్రామ పంచాయతీల వారీగా ఇప్పటి వరకు వసూలు చేసిన ఇంటి పన్నులు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇంటి పన్ను వసూలు కార్యక్రమాన్ని వేగవంతం చేసి వంద శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో పుష్పలత, ఏపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ప్రేమేందర్

కైలాస్‌నగర్: వార్డుల్లో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. వార్డ్ వాచ్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని భాగ్యనగర్, గాంధీనగర్ కాలనీల్లో మున్సిపల్ అధికారులతో కలిసి పర్యటించారు. ఆయా కాలనీల్లో కాలినడకన తిరుగుతూ అక్కడి సమస్యలను పరిశీలించారు. కాలనీవాసులతో మాట్లాడి వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పట్టణ సుందరీకరణ, మౌలిక వసతుల కల్పనకు ఎమ్మెల్యే జోగు రామన్న చొరవతో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లుగా తెలిపారు. భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా తగు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శైలజ, డీఈ తిరుపతి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేందర్, వార్డ్ కౌన్సిలర్ సంజయ్, కొండ గణేష్, ఇబ్రహీం పాల్గొన్నారు.

**పరామర్శ**

బేల: మండలంలోని మశాల(కె) గ్రామ ఉపసర్పంచ్ మడావి గోవింద్‌రావు తండ్రి మాణిక్‌రావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బుధవారం దుబ్బగూడ(ఎం) గ్రామంలో బాధిత కుటుంబాన్ని ఆదిలాబాద్ మున్సిపాలిటీ చైర్మన్ జోగు ప్రేమేందర్ పరామర్శించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ నాయకులు సతీష్‌పవార్, ప్రమోద్‌రెడ్డి, కొడపే అరుణ్, గుండవార్ ఆకాష్ పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**సన్మానం**

ఆదిలాబాద్‌అర్బన్: టీఎస్టీవో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ఎన్నికైన సంద అశోక్, ఎ. నవీన్ కుమార్, ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఎస్. రాజేశ్వర్‌ను డీటీవో ప్రణీత, కార్యాలయ సిబ్బంది బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏడీ నర్సింహులు, కార్యాలయ సూపరింటిండెంట్ వెంకటరమణ, మధుసూదన్‌రెడ్డి, నీల, ప్రేమలత, ఎస్. రాజేశ్వర్, రవి కుమార్, మహేష్, తుషార్, సతీష్, నిఖిల్, అబ్దుల్, అక్బర్, రమాకాంత్ పాల్గొన్నారు.

**13, 14న యూటీఎఫ్ మహాసభలు**

బేల: రంగారెడ్డి జిల్లాలో ఈనెల 13, 14న నిర్వహించే టీఎస్ యూటీఎఫ్ 5వ మహాసభలను విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు జయకర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీఎస్ఎస్‌లో పోస్టర్ విడుదల చేశారు. ఉపాధ్యాయులు, విద్యావంతులు, మేధావులు తరలిరావాలని కోరారు. నాయకులు నరేష్, సదానందం, సుగుణాకర్, దేవిదాస్, రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**రాళ్లతో దాడి చేయడం సరికాదు**

ఆదిలాబాద్‌టౌన్: డిగ్రీ పరీక్షల్లో కాపీయింగ్‌కు పాల్పడితే, డిబార్ చేశారనే అక్కసుతో ఇచ్చోడలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం ప్రయాణిస్తున్న కారుపై రాళ్ల దాడి చేయడం సరికాదని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆదిలాబాద్ స్టాఫ్ క్లబ్ అసోసియేషన్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను శాశ్వతంగా డిబార్ చేయాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయ అధికారులు ఫ్లైయింగ్ స్క్వాడ్, అబ్జర్వర్ల రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు.

**కుక్కల తరలింపు**

గుడిహత్నూర్: మండలంలోని మన్నాపూర్ పంచాయతీలో వివిధ వ్యాధులతో బాధపడుతున్న కుక్కలను పంచాయతీ అధికారులు దూర ప్రాంతానికి తరలించారు. ఒక వ్యానులో వచ్చిన ప్రత్యేక బృందం వీటిని పట్టుకొని తరలించినట్లు స్థానికులు తెలిపారు. కుక్కలకు చికిత్స అందించకుండా అడవికి తరలించడం సరికాదని జంతు ప్రేమికులు వాపోతున్నారు.

**వడ్డె బాబన్న జయంతి**

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని కాంతినగర్ కాలనీలో వడ్డె బాబన్న జయంతిని ఒడ్డెర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వడ్డె బాబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బాలాజీ, భుజంగ్‌రావు, నాగరాజు పాల్గొన్నారు.

**నిధుల మంజూరు**

బోథ్: మండలంలోని సొనాల గ్రామంలో మున్నూరుకాపు సంఘం భవన నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీపీ తుల శ్రీనివాస్ తెలిపారు. సంఘం సభ్యులు శాలువాతో ఆయనను బుధవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

**నేడు కంటి వెలుగుపై అవగాహన**

బోథ్: ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన కంటి వెలుగుపై గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు బోథ్ ఎంపీపీ తుల శ్రీనివాస్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొనాలని కోరారు.

**బడీడు పిల్లలను బడికి పంపాలి**

ఇచ్చోడ: బడీడు పిల్లలను బడికి పంపాలని ఎస్సీ ఆర్పీ శ్యాంసుందర్ అన్నారు. బుధవారం మండలంలోని ముఖరా(బి) గ్రామంలో బడీడు పిల్లలపై సర్వే నిర్వహించారు. 15 నుంచి 19 సంవత్సరాల లోపు ఉన్న నలుగురిని గుర్తించినట్లు పేర్కొన్నారు. చిన్నారులను పనిలో పెట్టుకోవద్దన్నారు. కార్యక్రమంలో ఐఈఆర్పీ సురేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సూర్యప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

**ఘనంగా లాల్ బహదూర్ శాస్త్రీ వర్ధంతి**

ఉట్నూర్‌రూరల్: మండలంలోని హస్నాపూర్‌లో లాల్ బహదూర్ శాస్త్రీ 57వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. శాస్త్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సునీల్ జాదవ్ మాట్లాడుతూ.. శాస్త్రీ దేశానికి అనేక సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు జావిద్, దస్తగిర్, జనార్దన్, షరీఫ్, రహీం పాల్గొన్నారు.

**నర్సరీ పనులు పూర్తి చేయాలి**

సిరికొండ: మండలంలోని ఫకీర్‌నాయక్‌తండా, వాయిపేట్, కుంటగూడ పంచాయతీలోని హరితహారం నర్సరీ పనులను బుధవారం ఎంపీడీవో సురేష్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. నర్సరీ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను, ఉపాధి ఎఫ్ఏలకు సూచించారు. ఉపయోగపడే మొక్కలను పెంచాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీవో శేషరావు, టీఏలు సుభాష్, పంచాయతీ కార్యదర్శి దుర్గయ్య పాల్గొన్నారు.

### సఖీ సేవలపై అవగాహన

ఆదిలాబాద్‌అర్బన్: సఖీ కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని ఐటీఐ కళాశాలలో బుధవారం సఖీ కేంద్రం అడ్మినిస్ట్రేటర్ సరస్వతి మహిళా చట్టం, పోక్సో చట్టం, గృహహింస చట్టం, స్టాకింగ్, సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, సఖీ లీగల్ కౌన్సిలర్ సంఘమిత్ర, కేస్ వర్కర్ నాగమణి, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

### చిన్నారులపై వీధి కుక్కల దాడులు

బోథ్: మండలంలోని ధన్నూర్ గ్రామంలో పిచ్చికుక్కలు స్వైర్య విహారం చేస్తున్నాయి. గత కొన్ని రోజులుగా గ్రామంలో కుక్కల బెడద తీవ్రంగా ఉంది. కాగా బుధవారం పలువురు చిన్నారులపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. దీంతో వారిని బోథ్‌లోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. గ్రామంలో పిచ్చి కుక్కలను అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.